క్లుప్తంగా

80 మందికి ఉచిత వైద్య సేవలు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న స్వామి రామానంద

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం హోమియో, యోగ, ప్రకృతి ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో యోగా నిపుణులు అల్లూరి శ్రీనివాసరాలు, హోమియో వైద్యురాలు లక్ష్మీ వినీల 80 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్య సేవలు అందజేయడమే లక్ష్యంగా ప్రతి సోమవారం అరుణాచలక్షేత్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వర్మ, తాతాజీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అరుణాచలేశ్వర స్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసియున్న అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి వారికి సోమవారం భక్తులు విశేష పూజలు చేశారు. పండితులు స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత



భూమి పూజ చేస్తున్న ముదునూరి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, జీవితానికి సార్థకత చేకూరుతుందని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరలో ఈ నెల 23న దెందుకూరి యుగంధర్ రాజా స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన పూజను ఘనంగా నిర్వహించనున్న సందర్భంగా సోమవారం లక్ష బిల్వార్చన పూజకు భూమి పూజ చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని ఆయన భక్తులకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ముదునూరి సీతారామరాజు, చంటి స్వామి, అడ్డాల సూర్యనారాయణ రాజు, ఏఎస్ఎన్ రాజు, దెందుకూరి హరిరాజు, దాడి పుత్రయ్య, రాయి సర్వారాయుడు, పోకనాటి శ్రీను, అప్పికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



కత్తిపూడి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శంఖవరం: అంగన్వాడీ కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మి సూచించారు. మండలంలోని కత్తిపూడి అంగన్వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులకు ఆహారంతో పాటుతో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రతి చిన్నారి 5 సంవత్సరాల వరకు అంగన్వాడీలోనే విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులకు పుస్తకాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునందన్‌రావు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 7గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ 9,740 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాటు కాలం

- వర్షాకాలంలో విషసర్పాల సంచారం
- సమయస్ఫూర్తే ప్రధానమంటున్న వైద్యులు
- అధైర్యపడితే ప్రాణాపాయమే



ప్రత్తిపాడు: ఏది కరిచినా తక్షణం వైద్య సేవలు పొందడం అనివార్యమని గుర్తుంచుకోవాలి. ఆ సమయం అర్ధరాత్రయినా, పగలైనా సరే.. ఆసుపత్రిలో చేరిన తర్వాత మరణించినవారు చాలా అరుదు. పాముకాటుకు మొదట బాధ్యత వహించాల్సింది మనమే. వాటికి మనం ఏదైనా అపాయం తలపెడతామోనన్న భయంతోనే అవి కాటేస్తుంటాయి. వాటిని పొరపాటున కాలితో తొక్కేయడమో లేక గడ్డి కోస్తున్నప్పుడు వాటిని పట్టుకోవడమో, తాకడమో చేయడంతోనే అవి కాటేస్తున్నాయని గుర్తించాలి. వాతావరణం అనుకూలించడంతో విషసర్పాలు పొదల మాటు నుంచి ఆరుబయటకు వస్తాయి. ఎలుకలు, పందికొక్కులు వంటి వాటిని తినేందుకు పాములు పంట పొలాల వద్ద కాపు కాస్తాయని, పొలాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

సర్పాల్లో ఎన్నో రకాలు..

నిత్యం మనకు కనిపించే విష సర్పాలు మాత్రం నాలుగు ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. మనకు నిత్యం కనిపించే వాటిల్లో తాచుపాము (నాగుపాము), కట్లపాము, రక్తపింజరి, గుమ్మడిత్తుల పింజరి రకం విషసర్పాలే విషపూరితమైనవి. ఏటా వర్షాకాలంలో పొలం గట్లపైన, పెరట్లో, గడ్డివాములపైన సూర్యకాంతి కోసం పడగ ఎత్తుకుని నిరీక్షిస్తుంటాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కాటు తప్పదు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ..

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏటా సగటున 25 మంది పాముకాట్లకు గురవుతుంటే..వీరిలో కనీసం పది మంది వరకు మృత్యువాతపడుతున్నారు. ఇటీవల ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఉర్లంకల మణికుమార్ (27) వ్యవసాయ పనులు ముగించుకుని, పొద్దుపోయే సమయంలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. మబ్బు వల్ల వెలుతురు సరిగా లేకపోవడంతో ఆయన కుడికాలు బొటన వేలిపై కింగ్ కోబ్రా జాతికి చెందిన పాము కాటు వేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న మణికుమార్‌ను బంధువులు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా సుమారు మూడున్నర గంటల పాటు అత్యవసర చికిత్సతో పాటు 20 యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు అందివ్వడంతో కోలుకున్నాడు. గత వారం ప్రత్తిపాడు మండలం బురదకోట గిరిజన గ్రామ పంచాయతీలోని ధారపల్లిలో బుట్టారి లోవకుమారి తన ఇంటిలోనే నిద్రపోతుండగా పాము కాటు వేసింది. వెంటనే కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మారుమూల ప్రాంతాలు, గిరిజన తండాల్లో వెలుగులోకి రాని ఇటువంటి సంఘటనలెన్నో.

గుర్తించడం ఎలా..?

పాము కాటు వేసిన అనంతరం ఇది విషపూరితమైనదా, కాదా అన్నది తెలుసుకోవాలి. కాటు వేసిన ప్రాంతంలో ఎన్ని గాట్లు ఉన్నాయో పరిశీలించాలి. ఒకటి, రెండు పళ్లతో గాట్లు ఉంటే విషపూరితమైనది. మూడు అంతకంటే ఎక్కువ ఉంటే విషం లేని పాములుగా ప్రాథమిక నిర్ధారణకు రావొచ్చు. పాము కాటు వేసిన ప్రాంతం నుంచి విషం క్రమంగా శరీరంలోని అన్ని భాగాలకు చేరుతుంది. ఇందుకు మూడు గంటల సమయం పడుతుంది. ఆలోపు చికిత్స చేయకపోతే మనిషి మృత్యువాత పడతాడు. ఇక పాము విషం నాలుగు రకాలుగా పనిచేస్తుంది. గుండె, నరాలు, రక్తం, శరీర కణజాల వ్యవస్థలపై పని చేస్తుంది. కాటుకు గురైన వ్యక్తి విష ప్రభావానికి లోనైనపుడు కళ్లు మూతలు పడడం, మెడ పక్కకు వంగడం, గాలి పీల్చలేకపోవడం, గుండె దడ, ఎక్కువగా చెమటలు పట్టడం, బీపీ వంటి లక్షణాలుంటాయి.



కింగ్ కోబ్రా కాటుకు గురైన వ్యక్తికి చికిత్స అందిస్తున్న ప్రత్తిపాడు సీహెచ్‌సీ సిబ్బంది (ఫైల్)

రక్షించుకోండి ఇలా..

- పొలాలకు వెళ్లే రైతులు వీలైతే మోకాలి వరకు కప్పి ఉండే బూట్లను పోలిన చెప్పులు ధరించడం అవసరం.
- గట్ల వెంబడి నడిచే క్రమంలో పెరిగిన గడ్డిలో విష పురుగులు ఉండే అవకాశం ఉన్నందున చేతిలో కర్ర ఉంచుకోవడంతో పాటు శబ్దం చేసుకుంటూ, వాటిని బెదరగొట్టే ప్రయత్నం చేయడం ఎంతో ముఖ్యం.
- రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లే వారు, ఇళ్ల పరిసరాల్లో వీధి లైట్లు లేని వారు విధిగా టార్చిలైట్లు వంటివి ఉంచుకోవడం మంచిది.
- పొలాల్లో గడ్డి కోసే ముందు కొంత ప్రాంతాన్ని ఎంచుకుని ఆ ప్రాంతంలో శబ్దం చేస్తూ తిరిగితే, విష పురుగులు బయపడి వెళ్లి పోతాయి.
- కేవలం పాములే కాకుండా తేళ్లు, మండ్రగబ్బలు కూడా విషపూరితమే కావడంతో వాటి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి.

యాంటీబయోటిక్ అందుబాటులో ఉంది



వర్షాకాలం విష పురుగులతో జాగ్రత్తగా ఉండాలి. సరైన సమయంలో చికిత్స అందకపోతే కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవ్వచ్చు. పాము కరిచిన వెంటనే కంగారు పడకుండా కరిచిన పాము ఎలాంటిదో తెలుసుకునే ప్రయత్నం చేసి దానికి సరైన చికిత్సని అందించే ప్రయత్నం చేయాలి. సీహెచ్‌సీలో యాంటీ స్నేక్ వీనమ్ (పాము కాటుకు సూది మందు) అందుబాటులో ఉంది. ఏ సమయంలోనైనా చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ బి.సౌమ్యమైఖేల్, సూపరిటెండెంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు

వైభవంగా దుర్గాపరమేశ్వరీ ఉత్సవం



ఊరేగింపును ప్రారంభిస్తున్న లాలం బాబ్జీ, ఉత్సవ సభ్యులు

కోటనందూరు: మండలంలోని కె.ఇ.చిన్నాయపాలెంలో కొలువైయున్న దుర్గాపరమేశ్వరీ అమ్మవారి శరన్నవరాత్రుల ముగింపు ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యులు ఊరేగింపు ఉత్సవం, జాతర మహోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలయ ధర్మకర్త లాలం బాబ్జీ కొబ్బరి కాయకొట్టి ఉత్సవయాత్రను ప్రారంభించారు. ఊరేగింపు బాణసంచా కాల్పుల నడుమ కోలహలంగా సాగింది.

పుష్కరిణిలో నేడు తెప్పోత్సవం

తుని రూరల్: పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఎస్.అన్నవరంలో కొలువైఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తలు సోమవారం తెలిపారు. మంగళవారం తెప్పోత్సవం అనంతరం పండిత సదస్యం, సాయంత్రం నక్షత్ర హారతి కార్యక్రమాలు జరుగుతాయని, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామివారి పరిపూర్ణ కరుణా కటాక్షం పొందాలన్నారు.

కూటమితో వ్యవస్థలు నిర్వీర్యం



ప్రత్తిపాడులో ముద్రగడ గిరిబాబును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచీ వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవుతున్నాయని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్య రంగాలన్నింటినీ అధోగతి పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రత్తిపాడులో సోమవారం ఎంపీటీసీ పినిశెట్టి అమృత స్వగృహంలో స్థానిక పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని గాలికొదిలేసిందని, నిత్యావసరాల ధరల నియంత్రణలో ప్రభుత్వం చర్యలు శూన్యమన్నారు. ఇప్పటికైనా వ్యవస్థలను బలోపేతం చేసి, ప్రజలకు సేవచేసేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పేదప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఎనలేని మేలు చేకూరిందన్నారు. పార్టీ కార్యకర్తలు గ్రామగ్రామాన వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ముద్రగడ గిరిబాబును పార్టీ పంచాయతీ రాజ్ విభాగం మండల అధ్యక్షుడు పినిశెట్టి ప్రకాష్, ఎంపీటీసీ అమృత తదితరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, ఏడిద రెడ్డినాయుడు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల మనోధైర్యానికే డిజిటల్ బుక్



ఏలేశ్వరంలో డిజిటల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అన్నవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్ తదితరులు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు మనోధైర్యం నింపేందుకే పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ ప్రారంభించారని పార్టీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి కాశీవిశ్వనాథ్ అన్నారు. పట్టణంలో సోమవారం మండల, రూరల్ పరిధిలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పార్టీ శ్రేణులపై ఎటువంటి వేధింపులు, దాడులు జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేసి అధికారంలోకి రాగానే విచారించి కఠినంగా శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు బులిపే దేవి, గుమ్ములూరి వెంకటరమణ, బీశెట్టి అప్పలరాజు, అల్లం ఆదినారాయణ, ఓలేటి చంటి, రమేష్‌రాజు, గొంతిరెడ్డి సతీష్, బందెల అంకాలు, ముద్రగడ వీరేంద్ర, సఖిరెడ్డి బుజ్జి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎవరూ భయపడకండి..!

అన్నవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టిని మరల్చడానికి, వైఎస్సార్ సీపీ నాయకులను భయపెట్టడానికి కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని వైఎస్సార్ సీపీ శంఖవరం మండల కన్వీనర్ నరాల శ్రీను అన్నారు. సోమవారం అన్నవరంలో వైఎస్సార్ సీపీ డిజిటల్ యాప్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తమ పార్టీ నాయకులపై పెట్టే అక్రమ కేసులు, వేధింపులపై పార్టీ శ్రేణులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఈ యాప్ ద్వారా పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేయాలని పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, పార్టీ నాయకులు ఈగల అప్పారావు, సరమర్ల మధుబాబు, కూనిశెట్టి మాణిక్యం, అడపా సోమేష్, సకురు గుర్రాజు, ఆశిన శ్రీను, గణేశుల బాబ్జీ, సింగంపల్లి రాము, యాళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లకు శంకుస్థాపన

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ సోమవారం ప్రారంభించారు. జగన్నాథపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న గోకులం షెడ్లుకు శంకుస్థాపన చేశారు. భూపతిపాలెం గురుకుల పాఠశాలలో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ.60 లక్షలతో నిర్మిస్తున్న మరుగుదొడ్లును ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు,

జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ధరణాలకోట శ్రీను

ప్రత్తిపాడు: జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షుడిగా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఎన్నికయ్యారు. కాకినాడలో జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి కాంగ్రెస్ విస్తృత సమావేశంలో ధరణాలకోట శ్రీను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్టు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు ఎం.సత్యానందరావు తెలిపారు. అనంతరం నియామకపు పత్రాన్ని మాజీ కేంద్రమంత్రి ఎం.ఎం.పల్లంరాజు ఆయనకు అందజేశారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక

రౌతులపూడి: మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా ఎస్ఎస్ పట్నం శివారు సీహెచ్‌పీ పడాలపురం(ఈనాం)కు చెందిన నాగం బుల్లివెంకన్నదొర(రమేష్) ఎంపికయ్యారు. సోమవారం కాకినాడలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కాంగ్రెస్‌పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో రమేష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

శ్రీసంస్థాన సత్రం భూములకు వేలం



తొండంగి శివాలయంలో పిఠాపురం శ్రీసంస్థాన సత్రం భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థాన సత్రానికి చెందిన తొండంగిలోని భూములకు వేలం నిర్వహించాలని కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు, సత్రం ఈవో శివబాబు సత్రం భూములకు సోమవారం కౌలు వేలం నిర్వహించారు. గ్రామంలోని శివాలయంలో కాకినాడ దేవదాయ–ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్ర కుమార్ పర్యవేక్షణలో శ్రీసంస్థాన సత్రం ఈవో గెద్దనాపల్లి శివబాబు, ఎం.భద్రరావు, డి.శ్రీనివాస్, కె.వేణుగోపాల్, శ్రీసంస్థాన సత్రం ఈవో హైకోర్టును ఆశ్రయించిన రైతులతో పాటు కౌలు వేలానికి అర్హత కలిగి, ఆశక్తి కలిగిన మరికొద్ది మంది రైతులు కూడా వేలంలో పాల్గొన్నారు. కాగా 12 బిట్లకు సంబంధించిన రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వీరిలో ఒక బిట్టుకు ఒకరు, మరో 11 బిట్లకు కలిపి రెండు పిటిషన్లు వేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఉదయం ఆలయంలో కౌలు వేలం ప్రారంభించిన అధికారులు ఆరు బిట్లకు కౌలు వేలం నిర్వహించారు. మిగిలిన ఆరుగురిలో నిబంధనల ప్రకారం ఐదు మంది డిఫాల్టర్లుగా అధికారులు నిర్ధారించారు. కాగా కోర్టును ఆశ్రయించిన వారిలో ఒకరు మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా సాయంత్రం ఐదు గంటల్లోపు కౌలు వేలం వేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో మిగిలిన ఆరు బిట్లుకు గానూ ఐదు బిట్లకు వేలం నిర్వహించారు. ఒక బిట్టుకు సంబంధించి కౌలు వేలం తక్కువ కావడంతో వేలం పాటను ఖరారు చేయలేదని శ్రీసంస్థాన సత్రం ఈవో తెలిపారు. కాగా వేలంలో పాల్గొన్న రైతులు ఇప్పటికే వరినాట్లు వేసిన నేపథ్యంలో కౌలు వేలంలో ఖరారు చేసుకున్న రైతులకు సాగు ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కొంత సేపు వేలం ప్రక్రియ రసాభాసగా మారింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తాము కౌలు వేలం నిర్వహిస్తున్నామని ప్రస్తుత పరిస్థితులను బట్టి సాగు చేసుకోవాలని పాటదారులకు అధికారులు వివరించారు. అనంతరం అధికారులు నిబంధనల ప్రకారం కౌలు వేలం నిర్వహించి హెచ్చు పాటదారులకు ఖరారు చేశారు. కాగా 11 బిట్లకు సంబంధించి గతంలో రూ.3,55,600 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.6,08,000 ఆదాయం వచ్చిందని ఈవో శివబాబు తెలిపారు. గతం కంటే ప్రస్తుతం రూ.2,52,400 అధికంగా ఆదాయం వచ్చిందన్నారు. కౌలు వేలంలో కొన్ని బిట్లకు గత కౌలు రైతులే దక్కించుకోగా మరికొన్ని బిట్లకు కొత్త కౌలుదారులు వేలం పాటలో హెచ్చుతో పాటదారులు కౌలు దక్కించుకున్నారు. వాయిదా వేసిన బిట్టుకు త్వరలో వేలం నిర్వహిస్తామని ఈవో వివరించారు. వేలానికి తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, తుని రూరల్ ఎస్సై కృష్ణమూర్తి, అన్నవరం అడిషనల్ ఎస్సై ఎం.ప్రసాద్ ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



ఏలేశ్వరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రేంజ్ జాన్, ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: వన్యప్రాణులను సంరక్షించుకోవాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.జాన్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అటవీ శాఖ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డి.సునీత అధ్యక్షతన వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. వన్యప్రాణులను వేటాడుతూ అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణులు, అడవులు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వన్యప్రాణులు సంరక్షించడంలో అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణ అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వాకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ ప్రగడ ప్రయాగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు సురేష్, మదీనా, శివప్రసాద్, శ్రీలక్ష్మీ, వీరభద్రరావు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరిది

శంఖవరం: పకృతి ప్రసాదించిన వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల అటవీశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో సోమవారం విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వన్య ప్రాణులు, అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని, జీవ వైవిధ్యం అవశ్యకత గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వన్య ప్రాణులు, అటవీ సంరక్షణపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి రమణ, సిబ్బంది బూరమ్మ, లావణ్య, ఉపాధ్యాయుడు తోట సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా నిల్వలపై ఉక్కుపాదం



గండేపల్లిలోని మందుగుండు సామాగ్రి కేంద్రంలో వివరాలు నమోదు చేసుకుంటున్న సీఐ నాగబాబు

గండేపల్లి: దీపావళి పండుగను పురస్కరించుకుని అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. గండేపల్లిలో మందుగుండు సామాగ్రి తయారీ కేంద్రాలని సోమవారం ఆయన తనిఖీ చేశారు. మందుగుండు తయారీ, క్రయ, విక్రయాలు దుకాణదారులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలు సంభవించకుండా తగిన భద్రత చర్యలు పాటించాలన్నారు. జన సంచారం లేని, ఆరుబయట ఖాళీ ప్రదేశాల్లో సామాగ్రి విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి దుకాణాలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై యూవి శివ నాగబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, అగ్రిమాపక కేంద్రం ఎస్సై రత్నరాజు ఉన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

జగ్గంపేట: మండలంలో బాణసంచా తయారీ కేంద్రాలను సోమవారం అధికారులు పరిశీలించారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారీ చేసి నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా జనావాసాల మధ్య బాణసంచా నిల్వ చేస్తే తమకి సమాచారం ఇవ్వాలని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ హెచ్చరించారు. జగ్గంపేట శివారులో బాణసంచా తయారీ కేంద్రం వద్ద నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని, యాజమాన్యంకు సూచించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట తహసీల్దార్ జేవీఆర్ రమేష్, జగ్గంపేట అగ్నిమాపక అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు ఉత్తమ అవార్డు



ప్రిన్సిపాల్ బాల మణికుమారికి అవార్డును అందిస్తున్న కలెక్టర్

శంఖవరం: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర అవార్డుకి ఎంపికైంది. సోమవారం కాకినాడ కళా క్షేత్రంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ షన్మోహన్ సగలి కేజీబీవీ ప్రిన్సిపాల్ బాల మణికుమారికి అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ అవార్డుకు ఐదు పాఠశాలలు ఎంపికైతే వాటిలో తమ పాఠశాల ఒక్కటవ్వడం ఆనందంగా ఉందన్నారు. అవార్డుకు ఎంపికైనా పాఠశాల ప్రిన్సిపాల్‌ను పలువురు అభినందించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి అప్రజాస్వామికం

ప్రత్తిపాడు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్ గవాయిపై దాడికి పాల్పడడాన్ని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో సోమవారం కేసు విచారిస్తున్న సమయంలో ఓ న్యాయవాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై షూ (బూటు) విసిరి 'సనాతన సంస్థకు ఎలాంటి అవమానం జరిగినా సహించబోము' అని పదేపదే నినదించి, దాడికి పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడి కుల, మత పరమైన దాడిగా ఐలాజ్ భావిస్తోందన్నారు. ఈ మొత్తం ఘటనపై సమగ్ర విచారణ చేయాలని, నిందితుడు, షూ విసిరిన దుండగుడిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి గ్రామాలకు నేడు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ప్రత్తిపాడు విద్యుత్‌శాఖ ఏఈ ఎ.శ్రీను సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒమ్మంగి 11 కేవీ వ్యవసాయ ఫీడర్‌లో కొత్త లైన్ల పునరుద్ధరణ, లైన్‌ల మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా రెండు గ్రామాలకు అంతరాయం ఉంటుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

గోకవరం: మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గోకవరం సూర్య ఫంక్షన్ హాల్లో ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లను పలువురు ప్రముఖులు సత్కారించారు. మండల శాఖ అధ్యక్షుడు ఓవి రమాశర్మ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు చోళ్ల రాజ్‌కుమార్, రొబ్బి కృష్ణవేణి, కత్తుల వీర్రాజులను సత్కరించారు.